క్లుప్తంగా

'సనాతన ధర్మం గొప్పది'



సత్సంగంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సారవకోట: సనాతన ధర్మం గొప్పదని వాన ప్రస్థానంకు చెందిన బ్రహ్మచారి సత్యనారాయణ స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో ఆధ్మాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో సత్సంగం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ సంప్రదాయాలు, ఆచారాలు విజ్ఞాన శాస్త్రంతో ముడిపడి ఉన్నాయన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ ఆచార, సంప్రదాయాలను ఆచరించాలని సూచించారు. ఆయనతో పాటు నరసింహస్వామి, సోమేశ్వరరావు, బగాది రామారావులు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. అనంతరం బుడితి గ్రామానికి చెందిన మెండ యయాతి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంతర్పన నిర్వహించారు. కార్యక్రమంలో జాడ మోహనరావు, మెండ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి



చాపరలో అవగాహన కల్పిస్తున్న సీఐ సాయి

మెళియాపుట్టి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకొని గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని పాతపట్నం సీఐ నెల్లి సాయి కోరారు. మండలంలోని చీపురుపల్లి, చాపర గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉండడం వలన ప్రజలు గుమిగూడవద్దని స్పష్టం చేశారు. వ్యక్తులను రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు ప్రవర్తించవద్దన్నారు. కార్యక్రమములో ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

జీవామృతంతో చెరుకు సాగుకు మేలు



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న చిరంజీవి

ఆమదాలవలస రూరల్: చెరుకు సాగు చేసే రైతులు జీవామృతాన్ని పంటకు ఎరువుగా వేస్తే సూక్ష్మపోషకాలు అందించడానికి వీలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయం మండల కో-ఆర్డినేటర్ నక్క చిరంజీవి అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడ గ్రామంలో చెరుకు పంటపై జీవామృతం వేయడం వలన కలిగే లాభాలను రైతులకు ఆదివారం వివరించారు. చెరుకు పంట సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో ఎరువులను ఇంటి వద్దనే తయారు చేసుకోవడం వలన పంటలో అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకం వలన పంటలపై ప్రభావం చూపుతూ భూముల్లో సారవంతం తగ్గుతుందన్నారు. జీవామృతం పంటలకు వాడకం వలన ఆరోగ్యకరమైన పంటలను పొందగలమని రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సాగు చేసే రైతుల పంటలను కొనుగోలు చేసేందుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నందున, ఈ దిశగా రైతులంతా పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో కట్టె జనుము విత్తనాలు

బూర్జ: మండలంలోని బూర్జ, పాలవలస గ్రామ ఆర్బీకేల్లో కట్టె జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీపై 10 కేజీల విత్తనాలు రూ.440లకే రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కట్టెజనుము విత్తనాలు మార్కెట్ రేటు 10 కేజీలు రూ.880లు ఉన్నప్పటికీ, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రూ.440లకే అందజేస్తోందన్నారు. మండల వ్యవసాయ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

ఆమదాలవలస రూరల్: మండలంలో అక్కులపేట జంక్షన్ వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో ఆదివారం ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి యువకులంతా కలిసి ప్రతీ ఆదివారం మజ్జిగను అందజేస్తున్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడంపై పలువురు అభినందిస్తున్నారు.

వెడల్పు పెంచారు.. ఆక్రమణలు మరిచారు..!



పీఎం షెడ్‌కు వెళ్లే మార్గంలో ఆర్అండ్‌బీ డ్రైన్‌పై ఒక హోటల్ యజమాని నిర్మించిన గోడ



పాత బస్టాండ్ వద్ద ఫుట్‌పాత్‌కు ముందు పెట్టిన విద్యుత్ పరికరాలు

నరసన్నపేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎవరికివారు తమ షాపులు, ఇళ్ల ముందుకు పెంచుకొని యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో మెయిన్ రోడ్డు 60 అడుగులు ఉండేది. ప్రస్తుతం 80 అడుగుల మేరకు విస్తరించారు. మధ్యలో డివైడర్ పెట్టి చెరోవైపు 40 అడుగుల మేరకు రోడ్డు నిర్మించారు. దీంతో ఇబ్బందులు తొలుగుతాయని స్థానికులు ఆశించారు. కానీ కొంతమంది షాపులు, ఇళ్ల ముందు రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలంతో పాటు ఆర్అండ్‌బీ డ్రైన్‌పైన కూడా ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపట్టారు. అలాగే డ్రైన్‌కు, తారురోడ్డుకు మధ్య ఉన్న మూడు అడుగుల స్థలం కూడా ఆక్రమించి రోడ్డు మీదకు కొందరు వస్తున్నారు. దీంతో పరిస్థితి అంతా మొదటికి వచ్చింది. ప్రభుత్వ స్థలం ఈవిధంగా ఆక్రమణలకు గురవ్వడంతో ద్విచక్ర వాహనదారులు ప్రధాన రోడ్డుపైనే తమ వాహనాలను పార్క్ చేస్తున్నారు. 40 అడుగుల రోడ్డు 20 అడుగుల మాదిరిగా క్రమేపీ మారిపోతోంది. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పోలీసులు పూర్తిగా ట్రాఫిక్‌ను వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, ఆర్అండ్‌బీ డ్రైన్‌పైన ఉన్న నిర్మాణాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- నరసన్నపేట



సీసీ డ్రైన్‌పైకి వచ్చి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారులు



వైఎస్సార్ కూడలి ఎదురుగా సీసీ డ్రైన్, రోడ్డు మార్జిన్ ఆక్రమణకు గురైన దృశ్యం

పోలీసుల కార్డన్ సెర్చ్



పాతపట్నం: గ్రామస్తులకు సూచనలిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేటలో ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలు తనిఖీలు చేసి, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. గ్రామంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, భవిష్యత్తులో నేర నియంత్రణ కోసం ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాతపట్నం: మండలంలోని బోరుభద్ర గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహ్మద్ యాసీన్, రాజేష్‌ల ఆధ్వర్యంలో పోలీసుల బృందం వీధులన్నీ జల్లెడ పట్టారు. వాహనాల ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఎలక్షన్ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి తగదాలకు తావివ్వొద్దని సూచించారు. అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు.

కొత్తూరు: మండలంలోని మహాసింగి గ్రామంలో ఆదివారం స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్ఐ ఎంఏ అహ్మద్‌ల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికలు కోడ్ అమలులో ఉండడంతో పాటు జూన్ 4వ తేదీన కౌటింగ్ ఉన్నందున ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని స్పష్టం చేశారు. గ్రామంలో అపరిచిత వ్యక్తుల వివరాలు సేకరించారు. గ్రామాల్లో ఎటువంటి పత్రాలు లేని బైక్‌లను గుర్తించి కేసులు నమోదు చేశారు.



కొత్తూరు: మహాసింగిలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్



పొందూరు: పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న అధికారులు



హిరమండలం: పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌కు వచ్చే విద్యా సంవత్సరానికి చెందిన పాఠ్య పుస్తకాలు ఆదివారం వచ్చాయని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ ఏడాది పాఠశాలలు పునః ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. ప్రస్తుతం మొదటి విడతలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 11,311 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. త్వరలోనే మిగిలిన అన్ని తరగతుల పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ వస్తాయని వెల్లడించారు.

పొందూరు: రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు 7,391 పాఠ్య పుస్తకాలు మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి చేరాయి. సంబంధిత పుస్తకాలను ఎంఈవో పీవీ రామరాజు పరిశీలించారు. 8, 9, 10 తరగతులకు సంబంధించి సీబీఎస్‌సీ సిలబస్ పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి వద్ద 12 కేవీ సబ్‌స్టేషన్‌కు ఆనుకొని మెయింట్‌నెన్స్ పనులు చేస్తున్నందున సోమవారం దేవాది, ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జి.శంకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని అన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కౌంటింగ్ రోజున నిషేధాజ్ఞలు



జి.నారాయణ స్వామి ఎస్ఐ

హిరమండలం: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకొని ఎలాంటి సంబరాలు, ర్యాలీలు చేపట్టవద్దని ఎస్ఐ జి.నారాయణ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఆయా రాజకీయ పార్టీల నాయకులు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వేలానికి నోచుకోని వెదురు



అన్నుపురం సమీపంలో రిజర్వ్ ఫారెస్టులో ఉన్న వెదురు



వాబ సమీపంలో విస్తారంగా పెరిగిన వెదురు

సారవకోట: మండలంలోని పలు గ్రామాల్లో రిజర్వ్ ఫారెస్టులో ఉన్న వెదురు వేలానికి నోచుకోవడం లేదు. బొంతు, సవరబొంతు, వాబ, అన్నుపురం, గొర్రిబంద తదితర గ్రామాల్లోని రిజర్వ్ ఫారెస్టులో కొన్ని వందల ఎకరాల్లో ఈ వెదురు ఉంది. వెదురు ముదిరిన తర్వాత దీనిని కోసి వేలం ద్వారా విక్రయాలు చేపట్టాలి. కానీ గత దశాబ్దకాలంగా ఈ వెదురు అలాగే ఉండడంతో కొంతమంది వీటిని అక్రమంగా తరలించుకునిపోతున్నారు. మండల కేంద్రంలో ఫారెస్టు సెక్షన్ కార్యాలయం ఉన్నప్పటికీ ఫారెస్టు సెక్షన్ అధికారి, బీట్ సిబ్బంది సైతం కనిపించకపోవడం విచారకరం. వీరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రతీ మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడా హాజరైయ్యే దాఖలాలు లేవు. దీంతో రిజర్వ్ ఫారెస్టులో ఉన్న వెదురు స్థితిగతులపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చే అవకాశం కూడా లేకపోవడంతో వెదురు వేలానికి నోచుకోవడం లేదు.

అంతటా ఆధ్యాత్మిక శోభ



పాతపట్నం: ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు



పాతపట్నం: ప్రత్యేక అలంకరణలో బంగారమ్మ తల్లి

హిరమండలం: మండలంలో అంబావల్లి గ్రామంలోని త్రినాథస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ మాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకొని వేకువజాము నుంచే భక్తులతో ఆలయం కిటకిటలాడింది. హిరమండలం, ఎల్ఎన్‌పేట, పాతపట్నం, కొత్తూరు మండలాలతో పాటు ఒడిశా నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బంగారమ్మ తల్లికి పూజలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామ వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి పెరిగిపోయింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 28వ తేదీ వరకు అమ్మవారి పెద్ద పండగలు నిర్వహిస్తున్నందున భక్తుల తాకిడి పెరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. మరో రెండు రోజుల్లో పండగలు ముగుస్తున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రహరాజపాలేంలో గ్రామ దేవత ఉత్సవాలు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలేంలో గ్రామదేవత బంగారమ్మ తల్లి ఉత్సవాల సందడి నెలకొంది. 9 ఏళ్ల తర్వాత ఈ పండగలు జరుగుతున్నాయి. ఈనెల 28వ తేదీతో ముగియనున్నాయి. దీంతో బంధుమిత్రులతో గ్రామం సందడిగా మారింది.

ఘనంగా చంద్రమ్మతల్లి ఉత్సవాలు

మెళియాపుట్టి: మండలంలోని పద్ద గ్రామంలో గ్రామ దేవత చంద్రమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు 7 రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ ఇంటి నుంచి ఆదివారం ముర్రాటలు తీసుకొచ్చి అమ్మవారికి చల్లదనం చేశారు. విగ్రహ ఊరేగింపులో కొయ్యబొమ్మలాట పలువురిని ఆకర్షించింది.

నీలమణి దుర్గకు పూజలు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాతపట్నం గ్రామ దేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతో పాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు రాజేష్ కుంకుమ పూజలు చేశారు. పలువురు వాహన పూజలు కూడా జరిపించారు.

త్రినాథస్వామి వ్రతాలు

కొత్తూరు: స్థానిక త్రినాథస్వామి ఆలయంలో వైశాఖ మాసం ఆదివారం పురస్కరించుకొని వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైశాఖ మాసంలో త్రినాథస్వామి వ్రతాలు చేయడం పవిత్రంగా భావిస్తారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి: అలంకరించిన చంద్రమ్మ తల్లిని తలపై ఊరేగింపునకు తీసుకెళ్తున్న మహిళ



కొత్తూరు: వ్రతాలు చేస్తున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: బంగారమ్మతల్లి వద్ద భక్తుల తాకిడి



హిరమండలం: త్రినాథ స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

రక్తదానం ఎంతో గొప్పది



రక్తదానం చేస్తున్న యువకులు

ఆమదాలవలస రూరల్: సమాజంలో రక్తదానం చేయడం ఎంతో గొప్పదిగా భావించాలని సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్షుడు వి.గోపీకృష్ణ అన్నారు. పట్టణంలో సిక్కోలు చేయూత సేవా సంఘం ఏడో వార్షికోత్సవం సందర్భంగా లక్ష్మీనగర్ స్కూల్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మంది దాతలు రక్తాన్ని దానం చేశారు. ఆపద సమయంలో రక్తం అందక చాలా మంది మృత్యువాత పడుతున్నారని, అటువంటి వారికి మరలా పునర్జన్మ ఇవ్వడానికి ఎంతగానో ఈ రక్తదానం ఉపయోగపడుతుందని తెలిపారు. సేవా సంఘం తరుపున మరిన్ని సమాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి వీటీ నాయుడు, సభ్యులు గుడ్ల బాబు, బి.రామకృష్ణ, ఎస్‌వీ రమణ, కేవీఎస్ శ్రీను, రమేష్, సురేష్, మధు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ పరీక్ష



అభ్యర్థులను చెక్ చేస్తున్న సిబ్బంది



పరీక్షకు హాజరైన విద్యార్థులు



హాల్ టిక్కెట్లు తనిఖీ చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: స్థానిక గొట్టిపల్లి ఫ్లైఓవర్ వంతెన సమీపంలోని కోర్ టెక్నాలజీ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్-24 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగగా ఉదయం సెషన్‌లో 320 మందికి 319 మంది, సాయంత్రం సెషన్‌లో 320 మందికి 318 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తంగా ముగ్గురు విద్యార్థులు మాత్రమే గైర్హాజరయ్యారు. కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహించారు. వచ్చిన అభ్యర్థులను మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు చేశారు.

శ్రీకూర్మనాథాలయానికి పోటెత్తిన భక్తులు

- శ్రీకూర్మంలో స్తంభించిన ట్రాఫిక్

గార: వైశాఖమాసం మూడో ఆదివారం శ్రీకూర్మనాథాలయానికి భక్తులు పోటెత్తారు. సుదూరం నుంచి వచ్చిన భక్తులు ముందుగా మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవాలయం, వైష్ణవీదుర్గ, తాబేళ్లపార్కును సందర్శించారు. దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానానికి 500 భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. సాధారణ భక్తులకు దేవుణ్ని దర్శించుకునేందుకు రెండు గంటల సమయం పట్టింది. భక్తులు రెండు క్యూలైన్ల ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లారు. ఆలయ ఈవో జి.గురునాథం, దేవస్థానసిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు. భక్తులు తీసుకువచ్చిన వాహనాల ఎక్కువగా రావడంతో శ్రీకూర్మం గ్రామంలో పలుమార్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాల పార్కింగ్ చేసేందుకు దేవస్థానం దగ్గరలో అవకాశం లేకపోవడంతో భక్తులతో పాటు సమీప గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.



దేవాలయంలో దక్షిణ మంటపం వద్ద వేచి ఉన్న భక్తులు